క్లుప్తంగా

ఓటరు జాబితా ప్రదర్శన



నోటీసుబోర్డులో ఓటరు జాబితాను చూపిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ జాబితా నమూనాను ప్రదర్శనకు ఉంచినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఈ మేరకు త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ లిస్టు నమూనాని మంగళవారం నోటీసుబోర్డులో ప్రదర్శనకు ఉంచామన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఓటర్లు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకొచ్చి మార్పులు చేయించుకోవాలని సూచించారు. కార్యాలయ పరిపాలనాధికారి రత్నరాజు, ఈవోపీఆర్డీ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్



ముసిరి గ్రామంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: సాగర పంచాయతీ సాగర, కిల్లోగుడ, అడపవలస, కొసోంగుడ, శిమిలిగుడ తదితర గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి గౌతమ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 2151 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశామన్నారు. పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సిబ్బంది మహేష్, త్రినాథరావు, సంజీవ్, మనోజ్, అప్పారావు, అనంతరావు, రత్నం, బాలు, ప్రకాష్, రమేష్, జయరాజు, నాయకుడు సీతారాం పాల్గొన్నారు.

బాలింతలకు వైద్య పరీక్షలు



పరీక్షిస్తున్న డాక్టర్ భావన

గంగవరం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భావన మాట్లాడుతూ తల్లిపాలలో ఔషధగుణాలున్నాయని శిశువులకు ఎంతో మేలు చేస్తోందన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఐదు సెంటర్లకు చెందిన సుమారు 40 మంది బాలింతలకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యంపై అవగాహనతో పాటు మందులు అందజేశారు. వైద్యులు కెవిన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి శిక్షణ తరగతులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా కమిటీ సభ్యుడ రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉన్నత విద్య, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎటపాక: పురుషోత్తపట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సైకిల్ ఫర్ హెల్త్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. బీపీ, క్యాన్సర్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్, వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులకు మందులు పంపిణీ చేశారు. నెల్లిపాక పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల పూత

- ఆశాజనకంగా మామిడి పూత
- అనుకూలించిన వాతావరణం
- గిరి రైతుల్లో ఆనందం



జోలాపుట్టులో విరగబూసిన మామిడిచెట్టు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో మామిడి చెట్లకు పూత ఆశాజనకంగా ఉంది.ప్రస్తుతం పూతతో చెట్లు కళకళలాడుతున్నాయి.దీంతో గిరిజన రైతులు మామిడి పంటపై ఈ ఏడాది ఎంతో ఆశలు పెట్టుకున్నారు. మామిడి పంటకు వేలల్లో గిరిజన రైతులు మదుపులు పెట్టి, మందులు పిచికారీ చేశారు. ప్రతి మామిడి తోటలు పూత ఏపుగా దర్శనమిస్తుంది.గత ఏడాదితో పోలిస్తే పూత అధికంగా ఉంది.దీంతో గిరిజన రైతులు మామిడి పంట ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

63 హెక్టార్లలో మామిడితోటలు

ముంచంగిపుట్టు మండలంలో 63హెక్టార్లలో గిరిజన రైతులు మామిడితోటలు ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో జనవరి, ఫిబ్రవరి నెలలోనే పూతకు వచ్చాయి. ప్రభుత్వం రైతు భరోసా సోమ్ము అందిచడంతో మామిడి తోటలు సస్యరక్షణ చర్యల్లో భాగంగా రైతులు అక్టోబర్, నవంబర్ నెలల్లో మామిడి తోటలకు పురుగు మందులు పిచికారీ చేశారు.

ప్రస్తుతం మామిడి పూత ఆశాజనకంగా ఉందని, రానున్న రోజుల్లో పంట దిగుబడి పెరిగి, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామాల్లో ఉన్న మామిడి తోటలకు ఎకరాకు 10వేలు చొప్పున గిరి రైతులు పెట్టుబడి పెట్టారు.దీంతో ప్రస్తుతం 90శాతం వరకు పూత వచ్చింది.

ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్న మందులు పిచికారీ చేస్తూ, తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలతు తీసుకొని, సలహాలు పాటించి, పాటించడం మామిడి పూత అధికంగా రావాడానికి కారణమని పలువురు రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వ సాయంతో తీరిన కష్టాలు

రెండు ఎకరాల మామిడి తోట ఉంది.అధికారులు సూచనలు పాటిస్తూ మందులు పిచికారీ చేశాను. వాతావరణం సైతం అనుకూలించడం మామిడి పూత ఆశాజనకంగా వచ్చింది. మామిడికాయల దిగుబడి కూడా బాగా వస్తే ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. గతంలో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వ అందిస్తున్న సాయంతో ప్రస్తుతం ఆ బాధలు తీరాయి. ఎంతో మేలు జరిగింది.

-కె.రామ్మూర్తి, గిరి రైతు, తోటపుట్టు, ముంచంగిపుట్టు మండలం

రైతులకు అవగాహన

మామిడి పంట సస్యరక్షణ కోసం ముందుస్తు గానే రైతులకు అవగాహన కల్పించాం. రైతులు సూచనలు క్రమం తప్పకుండా పాటించారు. దీంతో పూత స్థాయి బాగా పెరిగింది.తోటబడి కార్యక్రమం సైతం గ్రామాల్లో నిర్వహిస్తున్నాం.మామిడి పూత, పిందె దశలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని రైతులకు తెలియజేస్తున్నాం.

– ఎస్. పద్మ, హార్టికల్చర్ ఆఫీసర్, అరకు నియోజకవర్గం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతలు



కూనవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

కూనవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయి బ్రాహ్మణులన, వారి సేవలను గుర్తించి సముచిత స్థానం కల్పించారని నాయీబ్రాహ్మణుల సంఘం డివిజన్ నాయకులు కొనియాడారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా బార్బర్ షాపుల యజమానులకు ఏటా రూ.10,వేలు ఆర్థిక సహకారం అందజేస్తున్నారని కొనియాడారు. అలాగే దేవాలయాలపై ఆధారపడి జీవిస్తున్న నాయీబ్రాహ్మణులకు దేవస్థానం పాలక మండలిలో సభ్యుడిగా గుర్తింపు కల్పించడం పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం నాయీబ్రాహ్మణులంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వెంకటరావు, రాజు, సూర్యనారయణ, శ్రీనివాస్, రాజేష్, శ్రీను, హరినాథ్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



చెట్టు వద్ద పూజలు

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో అడవిరాజులబాబు పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు కుటుంబసమేతంగా, బంధుమిత్రులతో కలిసి సమీప అటవీ ప్రాంతాలకు రైతులు చేరుకున్నారు. ఓ చెట్టు వద్ద శుభ్రం చేసి, కళ్లాపు చల్లి, ముగ్గులు పెట్టారు. చెట్టుకు పసుపు కుంకుమలు అద్ది పూలతో అలంకరించారు. కట్టెల పొయ్యిపై వండిన పప్పు అన్నం పచ్చని ఆకుల్లో రాజులబాబులకు నైవేద్యం నివేదించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతంలో వంటలు చేసి, సహపంక్తి భోజనాలు చేశారు. దూసరపాము సర్పంచ్ చీడి శివ జీడిమామిడితోటలో ఏర్పాటు చేసిన రాజుల బాబుల పండుగకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామాల్లో తోటలు, అటవీ ప్రాంతాలు భక్తులతో సందడిగా దర్శనమిచ్చాయి.

సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



హుకుంపేట మండలం నాయకులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సీలేరులో ప్రచారం చేస్తున్న నాయకులు

సాక్షి,పాడేరు: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నేతలంతా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. హుకుంపేట మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులంతా తమ గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృత ప్రచారం చేసి సుధాకర్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సీలేరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీపీ కుమారి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి తదితరులు దారకొండ, దుప్పులవాడ, సీలేరులలో పర్యటించి, కరపత్రాలు పంపిణీ చేశారు.

వాహన ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చింతపల్లిరూరల్: వాహన ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాల్లో స్పీడ్ స్టాపర్లను పోలీసులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ వాహనచోదకులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియామాలను పాటించడంతో ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ఎస్ఐ అరుణ్ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్

గూడెం కొత్తవీధి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నమని సీఐ అశోక్‌కుమార్, తహసీల్దార్ రాజ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో వచ్చే నెల 13న ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైనట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎన్నికకు సంబంధించి మంగళవారం జీకేవీధి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేయనున్న పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక జరిగేలా ఓటర్లు సహకరించాలని కోరారు. ఎస్ఐ అప్పలసూరి, హెచ్ఎం గణేశ్వరరావు తదితరులున్నారు.

పీవీటీజీల సర్వే త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న చింతపల్లి ఎంపీడీవో సీతయ్య



జీకేవీధిలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

చింతపల్లిరూరల్: పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మెరకు మండల కేంద్రంలో ఎంపీడీవో లాలం సీతయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పీవీటీజీల (గదబ, కోదు,పోర్జా) కులాల వివరాలు సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు.పీవీటీజీ గ్రామాల్లో విద్యుత్, రహదారులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు సదుపాయం వంటి వాటికి అవసరమయ్యే బడ్జెట్‌ను రూపొందించాలని ఆయన కోరారు. మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది సహాయం తీసుకోని వివరాలు సేకరించాలన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పీవీటీజీ సర్వేపై ప్రత్యేక ప్రణాళిక

గూడెంకొత్తవిధి: మండలంలోని పీవీటీజీ గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీవీటీజీల కోసం కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించిందని, ఇందుకు ఆయా గ్రామాల్లో ఈ సర్వేను సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఈవోపీఆర్‌డి పాపారావు. జేఈలు భగవంతరావు, జ్యోతిబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు శశికాంత్, రవి చంద్రశేఖర్, సిబ్బంది, విద్యార్థులు

కూనవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కూటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా హెల్త్ మేళాను మంగళవారం నిర్వహించారు. కూనవరం, కూటూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సైకిళ్లు, ప్లకార్డ్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి డాక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా బీపీ, సుగర్, ఒత్తిడి తదితర రోగాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. వ్యాయాయం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు డి.శ్రీనివాస్, కె.భద్రకాళి, టీసీత, హెల్త్ అసిస్టెంట్ రత్నం, ఏఎన్ఎంలు, ఆశలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైకిల్ ఫర్ హెల్త్

జి.మాడుగుల: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో మంగళవారం సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.శశికాంత్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ఇందుకోసం శరీర వ్యాయం చేయడం మంచిదన్నారు. సైకిల్ తొక్కటం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని జబ్బులు దరిచేరవన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాయం చేయండి... ఆరోగ్యంగా ఉండండి అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్, హెచ్‌వీ రత్నం, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏల ధర్నా

సాక్షి,పాడేరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట దర్నా కార్యక్రమం చేశారు. కనీస వేతనాలు ఆమలుజేసి, ఉద్యోగ భద్రతతో పాటు పదోన్నతలు కలిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను వీఆర్ఏలు కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ, వీఆర్ఏల సంఘం నేతలు సుందరరావు, కొండబాబు, శేఖర్, రామకృష్ణ, దేవిక, అప్పారావు తదితరులున్నారు.

17న రేఖపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

వీఆర్ పురం: రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ సంస్థ కార్యాలయంలో ఈనెల 17 వ తేదీన నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఉండవల్లి ,గాంధీబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆలోక్ విజన్ ప్రోగ్రామ్ ,ఏఎస్‌డీఎస్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో కంటి సమస్యలతో బాధపడే వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తామన్నారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.

ఆలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



సచివాలయ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎంపీడీవో బాపన్నదొర సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో, ఆలయాల వద్ద సచివాలయ కార్యదర్శులు, గ్రేడ్-3,4,5 సిబ్బందిని ప్రత్యేకంగా నియమించినట్టు చెప్పారు. భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్త వహించాలన్నారు. నిర్వాహకులు కూడా తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలన్నారు. తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభంధించిన ఓటర్ల జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ బాపన్నదొర తెలిపారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

గంగవరం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి మండలశాఖ అధ్యక్షుడు కె.రఘుబాబుదొర అధ్యక్షత వహించగా యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు విల్సన్‌బాబు, నాయకులు కె.ఆదిరెడ్డి, కె.కృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు.

ఈ సందర్భంగా విల్సన్‌బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల పక్షాన సేవలందిస్తుందన్నారు. యూటీఎఫ్ ఎన్నో ఉద్యమాలు కారణంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించినట్టు గుర్తు చేశారు. సమావేశంలో కార్యదర్శి సిహెచ్.రాంబాబుదొర మండలశాఖ ఆధ్వర్యంలో చేసిన రాష్ట్ర, జిల్లా, డివిజన్ , మండల స్థాయిల్లో చేసిన ఉద్యమ కార్యక్రమాలను వివరించారు. సీనియర్ ఉపాధ్యాయులు, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు పి.రాంబాబు, సీనియర్ ఉపాధ్యాయిని సునీతకుమారిలు అందిస్తున్న సేవలకు గాను మండలశాఖ తరపున ఘనంగా సత్కరించారు.

ఏకగ్రీవంగా కార్యవర్గ ఎన్నిక

అనంతరం యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రఘుబాబుదొర, ప్రధాన కార్యదర్శిగా రాంబాబుదొర, మహిళా అధ్యక్షురాలిగా రుక్మిణీ దేవి, ఉపాధ్యక్షుడిగా బుజ్జిదొర, కోశాధికారిగా సత్యకిరణ్, యూటీఎఫ్ పత్రిక కన్వీనర్‌గా రామచంద్రారెడ్డి, కుటుంబ సంక్షేమ కన్వీనర్‌గా నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా వెంకన్నదొర, వెంకటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, జగ్గారెడ్డిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రఘుబాబు ఎన్నికావడం ఇది మూడోసారి కావడం విశేషం. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనున్న క్రీడాకారులు

రంపచోడవరం: పెదగెద్దాడ గ్రామంలో ఈ నెల 1 వ తేదీన ప్రారంభించిన అనంత చక్రరావు మంగతాయారు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష స్పందన లభిస్తుందని నిర్వాహకుడు నండూరి రాంబాబు మంగళవారం తెలిపారు. టోర్నీలో ఏజెన్సీ 11 మండలాలకు చెందిన 60 టీములు పాల్గొన్నట్టు చెప్పారు. ప్రస్తుతం క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుందన్నారు. సర్పంచ్ ప్రసాద్, ఉప సర్పంచ్ కన్నబాబు, హర్ష, గోపాల్, లింగారెడ్డి, గిరి, ప్రసన్న, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ ముత్యాలమ్మ

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ నుంచి కివర్ల పంచాయతీ బోగింజ గ్రామం వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, కివర్ల సర్పంచ్ ముత్యాలమ్మ మంగళవారం పరిశీలించారు. రహదారి పనులకు అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు అర్ధంతరంగా నిలిపివేయడంతో శివారు గ్రామాలకు రోడ్డు సమస్య తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రహదారి పనులకు అటవీశాఖ అనుమతులు వచ్చే విధంగా చూడాలని కోరారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: మండల సరిహద్దు ప్రాంతమైన వెదురునగరం గ్రామంలోని సాయిరాం ఆశ్రమ దేవాలయాల ప్రాంగణంలో మంగళవారం శ్రీనివాస కల్యాణం, పాశుపతి హోమం, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు సాయిరాం గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన రేణుకాలమ్మ మహంకాళి అమ్మవారి దేవాలయ గిరిజన ప్రధాన అర్చకులు రాజారెడ్డి, వేదపండితులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.